## వృద్ధాప్యాన్ని అడ్డుకునే విటమిన్-సీ!

బీజింగ్: మానవుడి వెన్నుపాములోని ప్రత్యేక లక్షణాలున్న కొన్ని జీవకణాలు వృద్ధాప్యానికి కారణమవుతున్నాయని, విటమిన్-సీ సప్లిమెంట్స్‌తో వృద్ధాప్య ప్రక్రియను అడ్డుకోవచ్చునని చైనా సైంటిస్టులు చెబుతున్నారు. దీనికి సంబంధించి కోతులపై జరిపిన పరిశోధనలు సక్సెస్ అయ్యాయని జర్నల్ నాచుర్, సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ వార్తా కథనాలు వెలువరించాయి. ఈ కథనం ప్రకారం, బీజింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జినోమిక్స్, చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌కు చెందిన సైంటిస్టుల బృందాలు 7 సంవత్సరాలుగా 'యాంటీ-ఏజింగ్'పై పరిశోధనలు జరిపాయి. మనిషి వెన్నుపాములోని ప్రత్యేక లక్షణాలున్న కణాల సముదాయం వృద్ధాప్యానికి కారణమవుతున్న మోటార్ న్యూరాన్లను ఉత్పత్తి చేస్తున్నది. అత్యంత సున్నితమైన ఈ కణాల జీవితకాలాన్ని విటమిన్-సీ పెంచిందని 10 కోతులపై సైంటిస్టులు జరిపిన పరిశోధనలో తేలింది. ట్యాబ్లెట్ల రూపంలో విటమిన్-సీ తీసుకున్నా వృద్ధాప్య ప్రక్రియను అడ్డుకోవచ్చునని సైంటిస్టుల పరిశోధన అభిప్రాయపడింది.

## మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్తతలు

**ఇద్దరు టీనేజర్లు అదృశ్యం**

ఇంఫాల్: మణిపూర్ రాజధాని ఇంఫాల్, దాని పరిసర ప్రాంతాల్లో సోమవారం మళ్లీ ఉద్రిక్తతలు ప్రారంభమయ్యాయి. మైబమ్ అవినాష్ (16), నింగ్‌తౌజమ్ ఆంథోనీ (19) అనే ఇద్దరు టీనేజర్లు ఆదివారం అదృశ్యమవడంతో మూడు ప్రముఖ ఉన్నత పాఠశాలల విద్యార్థులు సోమవారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. బాధితులిద్దరూ సెక్మల్ వైపు బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు వారిని అపహరించారని స్థానికులు చెప్పారు. సేనాపతి జిల్లాలోని ఓ పెట్రోలు బంకు వద్ద వీరిద్దరి ఫోన్లు ఓ కవరులో పెట్టి ఉండగా, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## సుప్రీం జడ్జీలుగా ముగ్గురు హైకోర్టు సీజేలు

**సిఫార్సు చేసిన కొలీజియం**

న్యూఢిల్లీ: ముగ్గురు హైకోర్టు చీఫ్ జస్టిస్‌లను సుప్రీం కోర్టు జడ్జీలుగా సుప్రీం కోర్టు కొలీజియం సోమవారం సిఫార్సు చేసింది. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం ఢిల్లీ హైకోర్టు చీఫ్ జస్టిస్ సతీష్ చంద్ర శర్మ, రాజస్థాన్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ఆగస్టిన్ జార్జ్ మాసిహ్, గౌహతి హైకోర్టు చీఫ్ జస్టిస్ సందీప్ మెహతా పేర్లను సిఫార్సు చేస్తూ కేంద్రానికి పంపింది.

## గాజా సిటీలోకి ఇజ్రాయెల్ బలగాలు!

దెయిర్ అల్ బలాహ్: హమాస్ పాలనలోని గాజా స్ట్రిప్ భూభాగంలోకి అడుగుపెట్టిన ఇజ్రాయెల్ దళాలు మరింత దూకుడుగా ముందుకెళ్తున్నాయి. సోమవారం ఉదయం గాజా సిటీని చుట్టుముట్టాయి. దాదాపు వారం పాటు తీవ్రమైన యుద్ధం తర్వాత ఇక్కడ వరకు వచ్చామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. గాజా సిటీలోకి బలగాలు ప్రవేశించేందుకు సిద్ధంగా ఉన్నాయని, మరో 48 గంటల్లో ఇది జరిగే అవకాశం ఉన్నదని ఇజ్రాయెల్ మీడియా పేర్కొన్నది. ఉత్తర గాజాను తక్కిన గాజా స్ట్రిప్ ప్రాంతంతో వేరుచేసిన ఐడీఎఫ్ దళాలు.. ఉత్తర గాజాపై ఆదివారం రాత్రి నుంచి పెద్దయెత్తున వైమానిక దాడులతో విరుచుకుపడ్డాయి.

# మోదీ.. వీటికి జవాబేదీ?

**బీజేపీ హయాంలో ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు**

తొమ్మిదిన్నరేండ్ల పాలనలో 300 శాతం వరకూ పెరుగుదల

పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెంపే ప్రధాన కారణం

డీజిల్ వాతతో వ్యవసాయ పెట్టుబడి, రవాణా వ్యవస్థపై భారం

ఉల్లి, ఉప్పు, పప్పు, నూనె, చింతపండు.. ఇలా అన్నీ భగ్గు

ముగ్గురున్న కుటుంబానికి వారం భోజనం ఖర్చు 1,800పైనే

*గతంలో రూ.100తో మార్కెట్‌కు వెళ్తే సంచి నిండా కూరగాయలు వచ్చేవి. ఇప్పుడు కిలో ఉల్లిగడ్డలు కూడా వస్తలే!*
**- ఓ గృహిణి నిట్టూర్పు**

*బండిలో పెట్రోల్‌కు గతంలో నెలకు రూ.1,000 అయ్యేది. ఇప్పుడు, రూ.4 వేలైనా సరిపోవట్లే!*
**- ఓ ఉద్యోగి మండిపాటు**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గద్దెనెక్కిన నాటి నుంచి ధరల మోతతో సామాన్యుడికి ప్రస్తుతం పస్తులు ఉండే దుస్థితి దాపురించింది. సర్కారు అసమర్థ విధానాలు, అనాలోచిత నిర్ణయాలతో పేద, మధ్యతరగతి వారిపై ఏరోజుకారోజు నిత్యావసర వస్తువుల ధరల బండ పడుతూనే ఉన్నది. ఇప్పటికే గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్ పెంపుతో ప్రజలు అల్లాడుతుంటే.. పెరిగిన నిత్యావసరాల ధరలు వారికి మరింత పెనుభారంగా మారాయి. బియ్యం, వంటనూనె, పప్పులు, గోధుమపిండి, చక్కెర, పాలు, ఆలుగడ్డ, చింతపండు ఇలా అన్నింటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇటీవలి వరకు టమోటా ధరల 'మోత' మోగగా, ఇప్పుడు ఉల్లి కన్నీళ్లు పెట్టిస్తున్నది. కేంద్రం చమురు రేట్లను పెంచితే, దాని దెబ్బ వ్యవసాయ పెట్టుబడి, రవాణా వ్యవస్థపై పడింది. తద్వారా ఆ ప్రభావంతో సరుకుల ధరలు నింగినంటాయి. మరోవైపు మోదీ ముందుచూపులేని విధానాలతో అంతర్జాతీయంగా రూపాయి అథఃపాతాళానికి చేరుకొన్నది. దీని ప్రభావం దిగుమతులపై పడి అంతిమంగా అది నిత్యావసరాల ధరలు ఆకాశానికి చేరేలా చేసింది.

### 200 శాతం పెరుగుదల

కిలో ఉల్లి మొన్నటి వరకూ రూ.20కే లభించగా.. ప్రస్తుతం కిలో రూ.80-100 పలుకుతున్నది. పచ్చిమిర్చి, క్యాప్సికం, బీన్స్ తదితర కూరగాయల ధరలు ఉల్లితో పోటీపడి పరుగులు తీస్తున్నాయి. అల్లం, ధనియాలు, పచ్చిబఠానీల ధరలు రెట్టింపయ్యాయి. రూ.400కి చేరిన ఎండు మిరపకాయల ధరలు తినక ముందే కన్నీళ్లు తెప్పిస్తున్నాయని సామాన్యులు వాపోతున్నారు. మొత్తంగా గడిచిన 3-4 నెలల్లోనే వివిధ కూరగాయలు, నిత్యావసరాల ధరలు 10 నుంచి 200 శాతం వరకు పెరిగినట్టు విశ్లేషకులు చెబుతున్నారు.

### ఆజ్యం పోస్తున్న రూపాయి పతనం

2014లో మోదీ అధికారం చేపట్టిన నాటి నుంచి నిత్యావసరాల ధరలు సుమారు 300 శాతం పెరిగినట్టు లోకల్ సర్కిల్స్ ఇటీవల నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. ఇంధన ధరల పెరుగుదలతో రవాణా చార్జీలు 30 శాతం వరకు పెరిగినట్టు ట్రావెల్ ఏజెన్సీలు చెబుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలో క్రూడాయిల్ ధరలు తగ్గినప్పటికీ, ఆ లాభాన్ని వినియోగదారుడికి అందకుండా బీజేపీ సర్కారు ఖజానాకు మళ్లించింది. గడిచిన ఎనిమిదేండ్లలో మోదీ సర్కారు డీజిల్‌పై 512 శాతం, పెట్రోల్‌పై 194 శాతం ఎక్సైజ్ పన్నులను పెంచినట్టు పెట్రోలియం ప్లానింగ్ అండ్ అనాలిసిస్ సెల్ (పీపీఏసీ) నివేదిక వెల్లడించింది. ఒకవైపు రూపాయి పతనం, మరోవైపు చమురు ధరల పెంపు, కేంద్రం సుంకాలను తగ్గించకపోవడం వెరసి.. నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరుకున్నట్టు నిపుణులు చెబుతున్నారు.

**తొమ్మిదిన్నరేండ్లలో ధరల భారం పెరిగిందిలా..**

డీజిల్ పెంపు (77%), వ్యవసాయ/కూరగాయల పెట్టుబడి ఖర్చులో పెరుగుదల (45%), ఉత్పత్తి వ్యయంలో పెరుగుదల (58%), రవాణా వ్యయంలో పెరుగుదల (30%), హోల్‌సేల్ వ్యాపారి వ్యయంలో పెరుగుదల (42%), రిటైల్ వ్యాపారి వ్యయంలో పెరుగుదల (48%), వినియోగదారుడిపై మొత్తంగా పడే భారం (300%)

| ఇంధనం | 2014 | 2023 | పెరుగుదల |
|---|---|---|---|
| పెట్రోల్ | రూ.71 | రూ.109 | 54% |
| డీజిల్ | రూ.55 | రూ.97 | 77% |
| వంటగ్యాస్ | రూ.399 | రూ.980 (ఇతర చార్జీలుకలిపి) | 146% |

| నిత్యావసరాలు (కిలో) | 2014 | 2023 | పెరుగుదల |
|---|---|---|---|
| బియ్యం | రూ.27 | రూ.63 | 133% |
| పల్లి నూనె | రూ.83 | రూ.155 | 86% |
| ఉల్లిగడ్డ | రూ.10 | రూ.80 | 700% |
| గోధుమపిండి | రూ.22 | రూ.62 | 182% |
| టమాట | రూ.10 | రూ.30 | 200% |
| ఉప్పు | రూ.10 | రూ.22 | 120% |
| చక్కెర | రూ.24 | రూ.48 | 100% |
| పాలు (లీటర్) | రూ.38 | రూ.64 | 69% |
| ఆలుగడ్డలు | రూ.18 | రూ.35 | 95% |
| చాయపత్త | రూ.194 | రూ.320 | 65% |
| చింతపండు | రూ.40 | రూ.150 | 275% |

| పప్పు దినుసులు(కిలో) | 2014 | 2023 | పెరుగుదల |
|---|---|---|---|
| కందిపప్పు | రూ.50 | రూ.120 | 140% |
| మినపప్పు | రూ.32 | రూ.110 | 244% |
| శనగపప్పు | రూ.24 | రూ.75 | 213% |

| డజను | 2014 | 2023 | పెరుగుదల |
|---|---|---|---|
| అరటిపండ్లు | రూ.33 | రూ.60 | 82% |
| గుడ్లు | రూ.38 | రూ.65 | 71% |

**ముగ్గురు సభ్యులు ఉన్న కుటుంబం భోజనం ఖర్చు**

| సంవత్సరం | వారానికి | రోజుకు | ప్లేటుకు | పెరుగుదల |
|---|---|---|---|---|
| 2014 | 1,008 | 144 | 48 | - |
| 2023 | 1,800 | 257 | 86 | 79% |

ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడలో ఎన్నికల విధులకు వెళ్తున్న సిబ్బంది

# నేడు తొలి పోరు

- ఛత్తీస్‌గఢ్ తొలి విడతలో 20 స్థానాలకు, మిజోరంలో అన్ని స్థానాలకు నేడు పోలింగ్
- నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో భద్రత కట్టుదిట్టం

రాయ్‌పూర్/ఐజ్వాల్, నవంబర్ 6: ఐదు రాష్ర్టాల అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా తొలి సంగ్రామానికి రంగం సిద్ధమైంది. ఛత్తీస్‌గఢ్‌లో తొలి విడతలో20 స్థానాలకు, మిజోరంలోని మొత్తం 40 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకే విడతగా మంగళవారం ఎన్నికలు జరుగనున్నాయి. పోలింగ్ కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఛత్తీస్‌గఢ్‌లో ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ మధ్య పోటీ ఉండగా.. ఈశాన్య రాష్ట్రం మిజోరంలో అధికార ఎంఎన్ఎఫ్, కాంగ్రెస్, జెడ్‌పీఎం మధ్య త్రిముఖ పోరు నెలకొన్నది. ఛత్తీస్‌గఢ్ మొదటి విడతలోని 12 నియోజకవర్గాలు నక్సల్స్ ప్రభావిత బస్తర్ రీజియన్‌లో ఉన్నాయి. ఎన్నికలు సజావుగా జరిగేందుకు 60 వేల మంది భద్రతా సిబ్బంది మోహరించినట్టు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. తొలి దశలో దాదాపు 40 లక్షల మంది తమ ఓటు హక్కు వినియోగించుకోన్నారు. సుక్మా, బీజాపూర్, దంతెవాడ, కంకేర్, నారాయణ్‌పూర్ జిల్లాలకు 156 ఎన్నికల సిబ్బంది బృందాలను హెలికాప్టర్ల ద్వారా తరలించామని తెలిపారు. 5,304 పోలింగ్ కేంద్రాలకు గానూ 2,431 కేంద్రాలోల వెబ్ క్యాస్టింగ్ ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నది. మాజీ సీఎం, బీజేపీ నేత రమణ్ సింగ్ పోటీచేస్తున్న రంజనాగావ్ నియోజకవర్గం తొలి దశ ఎన్నికల జాబితాలో ఉన్నది.

### మిజోరంలో 40 స్థానాలకు ఒకేసారి..

మిజోరంలోని 40 స్థానాలకు 174 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. మంగళవారం జరిగే ఎన్నికల్లో 8.57 లక్షల మందికి పైగా తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,276 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి మధూప్ వ్యాస్ వెల్లడించారు. వీటిలో 30 పోలింగ్ కేంద్రాలు అంతఃరాష్ట్ర, అంతర్జాతీయ సరిహద్దులో ఉన్నాయని, వాటిని సమస్యాత్మకంగా గుర్తించినట్టు సీనియర్ అధికారి ఒకరు పేర్కొన్నారు.

## లంచం కోసం కేంద్రమంత్రి కుమారుడి డిమాండ్

- రూ.కోట్ల లావాదేవీలపై చర్చ
- మధ్యప్రదేశ్‌లో వీడియో వైరల్
- మంత్రి రాజీనామా చేయాలి
- కాంగ్రెస్ పార్టీ డిమాండ్

భోపాల్ : కొద్ది రోజుల్లో ఎన్నికలు జరుగనున్న మధ్యప్రదేశ్‌లో కేంద్ర మంత్రి నరేంద్ర సింగ్ తోమర్ కుమారుడి వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ కావడం రాజకీయ వర్గాల్లో దుమారం రేపింది. మంత్రి కుమారుడు కోట్లాది రూపాయల డబ్బు గురించి మాట్లాడటం అందులో కన్పించింది. దీనిపై వెంటనే విచారణ జరిపి సంబంధిత వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనాతే డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కుమారుడు దేవేందర్ సింగ్ తోమర్ లంచం డిమాండ్ చేయడం, కోట్లాది రూపాయల లావాదేవీల గురించి మాట్లాడటం స్పష్టంగా కనబడుతున్నదని, దీనిని ఈసీ తీవ్రమైన అంశంగా పరిగణించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ అంశంపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయని ప్రశ్నించారు.

హీరాలాల్ సమారియాతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

## కేంద్ర సమాచార ప్రధాన కమిషనర్‌గా హీరాలాల్ సమారియా

**తెలంగాణ కేడర్ ఐఏఎస్ అధికారికి అత్యున్నత పదవి**

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): ఇప్పటివరకు కేంద్ర సమాచార కమిషనర్‌గా ఉన్న హీరాలాల్ సమారియా సోమవారం ప్రధాన సమాచార కమిషనర్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 63 ఏండ్ల హీరాలాల్‌తో ప్రమాణస్వీకారం చేయించారు. తెలంగాణ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన హీరాలాల్ సమారియా రాజస్థాన్‌లోని భరత్ పూర్ జిల్లాలోని ఓ కుగ్రామంలో జన్మించారు. ఆయన సింగరేణి డైరెక్టర్‌గా, విద్యుత్తు రంగంలో సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ చైర్మన్‌గా, మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేశారు. కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖలో సెక్రటరీగా పనిచేశారు. 2020లో సమాచార కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) ప్రధాన కమిషనర్‌గా వైకే సిన్హా పదవీకాలం ముగిసిన తర్వాత అక్టోబర్ 3 నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. కాగా, సీఐసీలో ప్రస్తుతం ఇద్దరు సమాచార కమిషనర్లు మాత్రమే ఉన్నారు. 8 మంది సమాచార కమిషనర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

# కర్ణాటక సీఎం రేసులో మరొకరు!

- తెరపైకి మంత్రి సతీశ్ జార్కిహోళి
- అన్ని కమ్యూనిటీలు తమ నేతలను సీఎం కావాలనుకుంటాయని వ్యాఖ్య
- తనను ముఖ్యమంత్రిని చేయాలనే డిమాండ్ అలా వచ్చిందేనని వెల్లడి
- అధిష్ఠానానిదే నిర్ణయమని వ్యాఖ్య

సతీశ్ జార్కిహోళి

బెంగళూరు, నవంబర్ 6: కర్ణాటక కాంగ్రెస్‌లో సీఎం కుర్చీలాట కొనసాగుతున్నది. ముఖ్యమంత్రి రేసులో రోజుకో పేరు తెరపైకి వస్తున్నది. తాజాగా మంత్రి సతీశ్ జార్ఖిహోళి సీఎం పదవిపై కీలక వ్యాఖ్యలు చేశారు. దళితులతో సహా అన్ని వర్గాల ప్రజలు తమ నాయకుడు ముఖ్యమంత్రి అవ్వాలని కోరుకొంటారని, ఆ మేరకు డిమాండ్లు కూడా ఉన్నాయని, అయితే దానిపై పార్టీ హైకమాండే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. గతంలో వాల్మీకి గురుపీఠ స్వామీజీ ప్రసన్నానంద తనను సీఎంగా చూడాలనుకొంటున్నట్టు చేసిన ప్రకటనపై సతీశ్ జార్కిహోళి స్పందిస్తూ.. అది పాత విషయమేనని చెప్పారు. తాము అధికారంలోకి రాక ముందు నుంచి కూడా ఆయన అదే చెబుతున్నారని పేర్కొన్నారు. కమ్యూనిటీ సమావేశాల్లో ఈ అంశం తెరపైకి వస్తుందని, ఈ డిమాండ్ పలు సందర్భాల్లో గతంలో కూడా వచ్చిందని అన్నారు. సీఎం రేసులో ఉన్నారా? అని అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ.. దళితులు, లింగాయత్‌లు, వొక్కళిగలు, ఇలా అన్ని కమ్యూనిటీల నుంచి తమ నేత సీఎం కావాలనే డిమాండ్ ఉన్నదని, అదేవిధంగా తనను సీఎం చేయాలనే డిమాండ్ కూడా వచ్చిందని చెప్పారు. పీడబ్ల్యూడీ మంత్రి, రాష్ట్ర పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్న సతీశ్ జార్కిహోళి వాల్మీకి(ఎస్టీ) వర్గానికి చెందిన బలమైన నేతగా ఉన్నారు.

### గతంలోనూ డిమాండ్లు వచ్చాయ్

'దళిత సీఎం డిమాండ్ 2013లో కూడా వచ్చింది. ఈ అంశాన్ని తర్వాత కూడా పదే పదే లేవనెత్తారు. ఆ ఐదేండ్ల టర్మ్‌లో చాలా రోజులు ఆ డిమాండ్ నడిచింది. అయితే అది జరుగలేదు. అదీ పరిస్థితి' అని జార్కిహోళి గుర్తుచేశారు. అయితే అది ఎప్పుడు జరుగుతుందనే ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. 'మనం వేచిచూడాల్సిన అవసరం ఉన్నది. 2008లో ఖర్గేజీ పోటీదారుగా, దళిత సీఎం డిమాండ్ వచ్చింది. అయితే ఆయనకు అవకాశం రాలేదు. ప్రస్తుతం రాష్ట్ర హోంమంత్రిగా ఉన్న జీ పరమేశ్వర పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎనిమిదేండ్లు ఉన్నారు. డిప్యూటీ సీఎం కూడా అయ్యారు. అయితే సీఎం అయ్యేందుకు చాన్స్ రాలేదు' అని సమాధానం ఇచ్చారు. ఈ ప్రభుత్వ రెండున్నరేండ్ల టర్మ్ తర్వాత ఇది జరుగుతుందా? అని మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నపై మాట్లాడుతూ 'అది మన చేతుల్లో లేదు. అక్కడ హైకమాండ్ ఉంటుంది. సీఎం, డిప్యూటీ సీఎం, పార్టీ అధ్యక్షుడు.. ఇలాంటి వాటిపై వారు మాత్రమే చెప్పగలరు' అని అన్నారు.

### అందరికీ ప్రాధాన్యం ఇవ్వాలి

పార్టీలో ఇటీవలి పరిణామాలు, డీకే శివకుమార్ తీరుపై అసంతృప్తిగా ఉన్న జార్కిహోళి.. ఇటీవల పలువురు ఎమ్మెల్యేలతో సహా దాదాపు 50 మంది నేతలతో క్యాంపు ఏర్పాటుకు ప్రయత్నాలు చేశారన్న వార్తలు వచ్చాయి. అయితే అధిష్ఠానం జోక్యంతో ఆయన ఆ ఆలోచనను విరమించుకొన్నట్టు తెలిసింది. రాష్ట్రంలో మూడో అధికార కేంద్రంగా మారాలను కొంటున్నారా? అని మీడియా అడుగ్గా.. అదేమీ లేదని, రాష్ట్రంలో ఒకే పవర్ సెంటర్ ఉంటుందని, అది అధిష్ఠానం మాత్రమేనని జార్కిహోళి చెప్పుకొచ్చారు. మరో ప్రశ్నకు స్పందిస్తూ కేవలం బయట మాట్లాడేవారు, టీవీలో కనిపించే వారు మాత్రమే నాయకులు కాదు.. బయటకు పెద్దగా మాట్లాడని వారికి కూడా సామర్థ్యం, జ్ఞానం ఉంటుందని, అటువంటి వారికి కూడా ప్రాధాన్యం దక్కాల్సిన అవసరం ఉన్నదన్నారు.

## సీఎం మార్పుపై హైకమాండ్‌దే నిర్ణయం

**కర్ణాటక సీఎం సిద్ధరామయ్య**

బెంగళూరు, నవంబర్ 6: ఐదేండ్లూ తానే సీఎంగా కొనసాగుతానంటూ ఇటీవల వ్యాఖ్యానించిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అంతలోనే మాట మార్చారు. సీఎంను మార్చాలా? వద్దా? అనేదానిపై కాంగ్రెస్ హైకమాండే నిర్ణయిస్తుందని అన్నారు. మరోవైపు, రాబోవు రోజుల్లో బీజేపీ, జేడీఎస్ పార్టీలకు చెందిన చాలా మంది ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నేతలు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతారని సిద్ధరామయ్య పేర్కొన్నారు.

## బాండ్ల నోటిఫికేషన్ ఎన్నికల కోడ్‌కు విరుద్ధం:ఈఏఎస్ శర్మ

న్యూఢిల్లీ: ఐదు రాష్ర్టాల అసెంబ్లీ ఎన్నికల వేళ కేంద్రంలోని అధికార బీజేపీ ఎన్నికల బాండ్ల నోటిఫికేషన్ జారీ చేయడంపై మాజీ బ్యూరోక్రాట్ ఈఏఎస్ శర్మ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా బాండ్ల ద్వారా విరాళాల సేకరణకు తాజా నోటిఫికేషన్ జారీ చేయటం ఎన్నికల నిబంధనావళికి విరుద్ధమని విమర్శించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. విరాళాల్లో అత్యధిక భాగం అధికార బీజేపీకి దక్కుతాయని, తద్వారా ఐదు రాష్ర్టాల అసెంబ్లీ ఎన్నికలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని ఆరోపించారు.

## జైల్లో పెట్టినా.. మీరే సీఎం

**సీఎం కేజ్రీవాల్‌తో ఆప్ ఎమ్మెల్యేలు**

న్యూఢిల్లీ, నవంబర్ 6: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసిన నేపథ్యంలో ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ సోమవారం పార్టీ ఎమ్మెల్యేలతో కీలక సమావేశం నిర్వహించారు. ఒక వేళ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్ట్ చేసినా, ముఖ్యమంత్రిగా ఆయనే కొనసాగాలని పార్టీ ఎమ్మెల్యేలంతా ముక్తకంఠంతో కోరినట్టు ఆప్ వెల్లడించింది. గతవారం కేజ్రీవాల్‌కు ఈడీ సమన్లు జారీచేసిన విషయం తెలిసిందే. అయితే ఈడీ ఆరోపణల్ని రాజకీయ ప్రేరేపితంగా పేర్కొంటూ సమన్లను ఆయన తిరస్కరించారు. నవంబర్ 2 నాటి ఈడీ విచారణకు హాజరుకాలేదు.

### జైల్లోనే క్యాబినెట్ భేటీ నిర్వహిస్తాం

సమావేశ వివరాల్ని ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ మీడియాకు వెల్లడించారు. 'కేజ్రీవాల్‌ను ఎన్నికల్లో ఓడించటం సాధ్యం కాదని గ్రహించిన బీజేపీ, కుట్రపూరిత చర్యలకు పాల్పడుతున్నది. కేజ్రీవాల్ అరెస్టయితే.. ప్రభుత్వ అధికారులు జైలుకు వెళ్లి సీఎంతో సమావేశమవుతారు. పరిస్థితులు చూస్తుంటే మమ్మల్ని కూడా జైల్లో పెట్టొచ్చు. అప్పుడు మేమంతా జైల్లోనే క్యాబినెట్ సమావేశాలు నిర్వహిస్తాం. అప్పుడు కూడా ఢిల్లీ ప్రభుత్వ పనులు మాత్రం ఆగవు' అని భరద్వాజ్ అన్నారు. ఎన్నికల ముంగిట ఈడీని అడ్డుపెట్టుకుని విపక్ష నేతలను కేంద్రం వేధిస్తున్నదని ఆప్ ఆగ్రహం వ్యక్తంచేసింది.

## బహిరంగ సభలో ప్రసంగిస్తుండగానే పంజాబ్ ఆప్ ఎమ్మెల్యే అరెస్ట్

- అదుపులోకి తీసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్
- బీజేపీ కుట్ర అంటూ ఆమ్ ఆద్మీ పార్టీ మండిపాటు

చండీగఢ్: ఒక బహిరంగ సభలో ప్రసంగిస్తుండగా పంజాబ్‌కు చెందిన ఆప్ ఎమ్మెల్యే జస్వంత్ సింగ్ గజ్జన్ మజ్రాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. మలేర్‌కోట్ జిల్లాలోని అమర్‌గఢ్‌లో ఉదయం బహిరంగ సభలో మాట్లాడుతుండగా ఎమ్మెల్యేను ఈడీ అరెస్ట్ చేసింది. బ్యాంక్‌ను మోసగించి, మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారన్న ఆరోపణతో ఆయనను అదుపులోకి తీసుకుంది. బ్యాంకు నుంచి రుణం తీసుకుని రూ.41 కోట్ల ఎగవేతకు పాల్పడ్డారన్న ఆరోపణతో గత ఏడాది అక్టోబర్‌లో జస్వంత్‌సింగ్ ఇంటిపై సీబీఐ దాడి చేసింది. అతని నుంచి లెక్కల్లో చూపని 16.57 లక్షల నగదు, విదేశీ కరెన్సీతో పాటు పలు పత్రాలు, మొబైల్స్, హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకుంది. దీనిపై ఈడీ నోటీసులు జారీ చేసింది. బహిరంగ సభలో ఎమ్మెల్యేను అరెస్ట్ చేయడాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఆయనను అరెస్ట్ చేసిన విధానాన్ని చూస్తే తమ పార్టీ పరువును తీయడానికి బీజేపీ కంకణం కట్టుకున్నట్టు కనిపిస్తున్నదని మండిపడింది.

## ఢిల్లీలో మళ్లీ సరి-బేసి విధానం

**కాలుష్యం పెరిగిపోవడంతో ప్రభుత్వం నిర్ణయం**

న్యూఢిల్లీ, నవంబర్ 6: వాయుకాలుష్యంతో సతమతమవుతున్న ఢిల్లీలో తిరిగి సరి-బేసి విధానం అమల్లోకి రానుంది. కాలుష్యాన్ని అరికట్టేందుకు రాష్ట్రంలో నవంబర్ 13 నుంచి 20 వరకు కార్లకు సరి-బేసి విధానాన్ని అమలుజేస్తామని ఢిల్లీ పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్ సోమవారం ప్రకటించారు. దీనికంటే ముందు కాలుష్య నియంత్రణపై ఉన్నతాధికారులతో సీఎం కేజ్రీవాల్ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన చర్యల్ని మంత్రి మీడియాకు వెల్లడించారు. దీపావళి, ఢిల్లీలో జరగబోయే ప్రపంచ క్రికెట్ పోటీ సందర్భంగా పటాసులు ఎవ్వరూ కాల్చరాదని హెచ్చరించారు. బోర్డు పరీక్షలకు సిద్ధమవుతున్న 10, 12 గ్రేడ్స్ విద్యార్థులకు తప్ప మిగతా క్లాసుల తరగతుల నిర్వహణను సస్పెండ్ చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు. 'దీపావళి తర్వాత సరి-బేసి విధానం అమల్లోకి వస్తుంది. ఆ తర్వాత కొనసాగించాలా? లేదా? అన్నది నవంబర్ 20న తెలుపుతాం. సరి-బేసి అమలుపై రవాణాశాఖతో సంప్రదింపులు జరుపుతున్నాం. మినహాయింపులు ఎవరికి ఇవ్వాలన్నది చర్చిస్తాం' అని చెప్పారు. కారు నెంబర్ ప్లేట్ ఆధారంగా సరి-బేసి విధానాన్ని ఢిల్లీలో 2016లో తీసుకొచ్చారు. వాహనాల కాలుష్యాన్ని తగ్గించేందుకు ఈ విధానాన్ని అమల్లోకి తేవటం ఆ రాష్ట్రంలో ఇది నాలుగోసారి.

## ఫోన్ నంబర్ లేకుండానే వాట్సాప్

**ఈ-మెయిల్ ద్వారా వెరిఫికేషన్**

న్యూఢిల్లీ: వాట్సాప్ ఖాతా ఫోన్ నంబర్‌తో అనుసంధానమై ఉంటుంది. ఒకవేళ ఆ ఫోన్ నంబర్ యాక్టివ్ లేకపోతే, ఫోన్ ఎక్కడైనా పోతే.. దాంట్లో ఉన్న వాట్సాప్ ఖాతాను కూడా యూజర్ కోల్పోయినట్టే. ఈ సమస్యను తొలిగించేందుకు ఫోన్‌నంబర్ అవసరం లేకుండా వాట్సాప్ సేవల్ని పొందే కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్టు కంపెనీవర్గాలు తెలిపాయి. ఫోన్ నంబర్‌తో కాకుండా యూజర్ల ఈ-మెయిల్ వెరిఫికేషన్‌తో వాట్సాప్ ఖాతాను అనుసంధానం చేసే ప్రక్రియపై కంపెనీ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు సమాచారం. వాట్సాప్ లేటెస్ట్ అప్‌డేట్‌తో మరిన్ని ఫీచర్స్, గోప్యతపై మెరుగైన పద్ధతుల్ని తీసుకురాబోతున్నది.